సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

బుధవారం । 27 । మార్చి । 2024

సూర్యతేజం.. చంద్రహాసం

వైభవంగా ఖాద్రీశుని బ్రహ్మోత్సవాలు



సూర్యప్రభ వాహనంపై నారసింహుడు



చంద్రప్రభపై శ్రీవారి దర్శనం

కదిరి: ఖాద్రీశుని బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా 8వ రోజైన మంగళవారం ఖాద్రీశుడు పగలు సూర్య ప్రభ, రాత్రి చంద్ర ప్రభ వాహనాలపై ఊరేగుతూ తిరువీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. లోకంలో పుట్టడం, పెరగడం, నశించడం అనే మూడు ప్రక్రియలు కాలాధీనాలు. ఆ కాల స్వరూపుడిని తానేనంటూ శ్రీవారు సూర్య, చంద్ర ప్రభలను అధిష్టించి దర్శనమిచ్చారని అర్చకులు తెలిపారు. పగటికి సూర్యుడు రారాజైతే, రేయికి చంద్రుడు అధిపతి. సృష్టికి ఎంతో ముఖ్యమైన ఈ రేయింబవళ్లను శ్రీమహావిష్ణువు రెండు కళ్లుగా కలిగి ఉండి వాటినే వాహనాలుగా మార్చుకొని సృష్టిలో సర్వమూ తానే అని చాటి చెబుతూ తిరువీధుల్లో దర్శనమిచ్చారు. ఈ ఉత్సవ ఉభయదారులుగా అంబే శ్రీరామమూర్తి కుటుంబీకులు వ్యవహరించారని ఆలయ సహాయ కమిషనర్ వి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. కాగా, బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారు మోహినీ అవతారంలో దర్శనమివ్వనున్నారు.

కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

- కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి



మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు, చిత్రంలో ఎస్పీ మాధవరెడ్డి, జేసీ అభిషేక్ కుమార్

పుట్టపర్తి అర్బన్: ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ప్రతి ఒక్కరూ పాటించాలని, ఎవరైనా కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అరుణ్‌బాబు హెచ్చరించారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో ఎస్పీ మాధవరెడ్డి, జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, డీఆర్‌ఓ కొండయ్య తదితరులతో కలిసి నియోజకవర్గ ఎన్నికల అధికారులు, సెక్టార్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని 27 మంది అధికారులను వివిధ టీంలలో నోడల్ ఆఫీసర్లుగా నియమించామన్నారు. జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పన పూర్తయిందన్నారు. ఎన్నికల విధులు నిర్వహించే అధికారులకు ఏప్రిల్ మొదటి వారంలో శిక్షణ ఉంటుందన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, డబ్బు, మద్యం, ఇతర వస్తువుల పంపిణీని నిరోధించడానికి ఫ్లయింగ్ స్క్వాడ్, సర్వేలెన్స్ టీం, మీడియా సర్టిఫికేషన్ టీం, వీడియో సర్వేలెన్స్ టీం, వీడియో వీవింగ్ టీంలు ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలన్నారు. కోడ్ ఉల్లంఘన జరిగితే ఎన్నికల కమిషన్‌కు లేదా జిల్లా ఎన్నికల అధికారికి సమాచారం ఇవ్వాలన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ప్రచారానికి సంబంధించి అన్ని అనుమతులు పొందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఏప్రిల్ 18 నుంచి నామినేషన్ ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. క్రిటికల్ పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక బందోబస్తు ఉంటుందన్నారు. వృద్ధులు, దివ్యాంగులు ఇంటి నుంచి ఓటు వేసే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ అందుబాటులోకి తెచ్చిందన్నారు. 85 ఏళ్ల వయస్సుపైబడిన వారు, 40 శాతం అంగవైకల్యం కలిగిన వారు నోటిఫికేషన్ వెలువడిన ఐదు రోజుల్లోపు ఫారం-12డీ ద్వారా ఆర్‌ఓ, ఏఆర్‌ఓకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

చెక్‌పోస్టుల్లో ప్రత్యేక నిఘా..

ఎస్పీ మాధవరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర, జిల్లా సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన చెక్ పోస్టుల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికలకు సంబంధించి పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని అన్ని శాఖల అధికారులకు జేసీ అభిషేక్ సూచించారు. సీ విజిల్ యాప్, ఈవీఎంల పనితీరును వివరించారు. కార్యక్రమంలో పుట్టపర్తి, కదిరి, ధర్మవరం, మడకశిర నియోజకవర్గాల ఎన్నికల అధికారులు భాగ్యరేఖ, సన్నీ వంశీకృష్ణ, వెంకటశివరామిరెడ్డి, గౌరీ శంకర్, డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

33 శాఖల ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్

ఎన్నికల విధుల్లో పాల్గొనే 33 శాఖల ఉద్యోగులతో పాటు మీడియా ప్రతినిధులకు ఎన్నికల సంఘం పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని కల్పించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. పోలింగ్ విధుల్లో ఉంటూ ఓటు వేయలేని వారికే పోస్టల్ బ్యాలెట్ అవకాశం ఉంటుందన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పోస్టల్ బ్యాలెట్ల కోసం ఒక నోడల్ అధికారిని నియమించడంతో పాటు దరఖాస్తు చేసుకునేందుకు అవసరమైన ఫారం-12డీని అందుబాటులో ఉంచుతామన్నారు.

క్లుప్తంగా

ప్రశాంత ఎన్నికలకు చర్యలు తీసుకోండి

• ఎస్పీ మాధవరెడ్డి



మాట్లాడుతున్న ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి టౌన్: జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఎస్పీ మాధవరెడ్డి ఆదేశించారు. నెలవారీ నేర సమీక్ష జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం జరిగింది. శాంతి భద్రతల పరిరక్షణ, ఎన్నికల కోడ్ ఉల్లంఘన, నేరాలు, శిక్షలు, కోర్టు కేసుల పురోగతి, ఎన్నికల సన్నద్ధతపై ఎస్పీ సమీక్షించారు. ఎన్నికల కమిషన్ నిబంధనలను తప్పకుండా పాటించాలన్నారు. రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్లకు క్రమం తప్పకుండా కౌన్సిలింగ్ నిర్వహించాలన్నారు. వారి కదలికలపై నిఘా ఉంచి బైండోవర్ చేయాలన్నారు. సమస్యాత్మక గ్రామాలు గుర్తించి నాకాబందీ చేపట్టాలన్నారు. రీపోలింగ్‌కు తావివ్వకుండా ఉండేలా ఓటర్లలో ఆత్మస్థైర్యం పెంచేందుకు కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించాలన్నారు. లైసెన్స్ కలిగిన తుపాకులను డిపాజిట్ చేయించాలన్నారు. అక్రమ మద్యం తరలింపు, విక్రయాలు, నిల్వలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ విష్ణుతో పాటు అన్ని సబ్ డివిజన్ల డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

'పది' పరీక్ష కేంద్రాల పరిశీలన



రికార్డులు పరిశీలిస్తున్న డీఈఓ మీనాక్షి

లేపాక్షి: మండల కేంద్రంలోని పదో తరగతి పరీక్షా కేంద్రాలను జిల్లా విద్యాశాఖాధికారి మీనాక్షి మంగళవారం పరిశీలించారు. విద్యార్థుల హాజరు శాతాన్ని అడిగి తెలుసుకున్నారు. మండల వ్యాప్తంగా 903 మంది విద్యార్థులకు గాను 76 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈఓలు నాగరాజు, కుళ్లాయప్ప తెలిపారు. అనంతరం స్థానిక ఎంఆర్‌సీని సందర్శించి రికార్డులు పరిశీలించారు.

ఐపీఎల్ హోరు.. బెట్టింగ్ జోరు

ఐపీఎల్‌లో భాగంగా గత ఆదివారం జరిగిన ముంబయి ఇండియన్స్, గుజరాత్ టైటాన్స్ జట్ల మధ్య పోరుపై భారీగా బెట్టింగ్‌లు జరిగాయి. తొలుత బ్యాటింగ్ చేసిన గుజరాత్ జట్టు 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 168 పరుగులు చేసింది. తక్కువ స్కోరు కావడంతో ధర్మవరానికి చెందిన ఓ టీ కొట్టు నిర్వాహకుడు గుజరాత్ జట్టుకు ఓటమి తప్పదని భావించి అక్కడే ఒక కారు డ్రైవర్‌తో రూ.50 వేలు బెట్టింగ్ వేశాడు. అయితే అనూహ్యంగా గుజరాత్ జట్టు విజయం సాధించడంతో పాలిచ్చే బర్రెను కొనుగోలు చేసేందుకు దాచుకున్న రూ.50 వేలు బెట్టింగ్‌లో కోల్పోయాడు. ఇది తెలిసి ఆ ఇంట్లో పెద్ద గొడవే జరిగింది.

హిందూపురానికి చెందిన ఓ రియల్టర్ గత శనివారం కోల్‌కతా నైట్‌రైడర్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్ల మధ్య జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టు గెలుస్తుందని చివరి ఓవర్‌లో ఆన్‌లైన్ బెట్టింగ్ వేసి రూ.లక్ష నష్టపోయాడు. దీంతో ఆయన బాధ వర్ణనాతీతం.

... ఈ పరిస్థితి వీరిద్దరిదే కాదు. జిల్లా వ్యాప్తంగా చాలా మంది యువత బెట్టింగ్ మాఫియా వలలో చిక్కి విలవిల్లాడుతున్నారు. మ్యాచ్ జరుగుతున్న ఒక్క రోజులోనే రూ.కోట్లు చేతులు మారుతున్నాయంటే ఐపీఎల్ బెట్టింగ్ ఏ స్థాయిలో జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు.

- చేతులు మారుతున్న రూ.కోట్లు
- స్మార్ట్‌ఫోన్‌తో సాగుతున్న జూదం
- బెట్టింగ్ మాఫియా మాయలో యువత



కదిరి: పల్లె..పట్టణం, చిన్న..పెద్ద, ఆడ..మగ అనే తేడా లేకుండా జనం క్రికెట్ మ్యాచ్‌ను చూసేందుకు ఆసక్తి చూపుతున్నారు. క్రికెట్‌పై ప్రజలకున్న ఆసక్తిని కొందరు బెట్టింగ్‌ల రూపంలో సొమ్ము చేసుకుంటున్నారు. ముఖ్యంగా యువతను ఈ ఊబిలోకి లాగి వారి ఉజ్వల భవిష్యత్‌ను నాశనం చేస్తున్నారు. ఆటో డ్రైవర్లు, దినసరి కూలీలు సైతం రోజువారీ సంపాదన మొత్తం బెట్టింగ్‌లు కట్టి నష్టపోతున్నారు. ఈ మాయా జూదం నుంచి బయటపడలేని కొందరు అధిక వడ్డీలకు అప్పులు చేసి బెట్టింగ్‌లు కడుతున్నారు. ఈ జూదాన్ని అరికట్టాల్సిన పోలీసు శాఖలోని కొందరు ఉద్యోగులు సైతం బెట్టింగ్‌లు కడుతుండడం గమనార్హం.

ఎక్కడ విన్నా 'బెట్టింగ్ ఎంత?'

జిల్లాలో ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ వ్యవహారం రోజుకు లక్షల్లో కాదు..రూ.కోట్లకు చేరుకుంది. గత శనివారం జరిగిన టోర్నీలో ఎక్కువ మంది ఢిల్లీ జట్టు గెలుస్తుందని బెట్టింగ్ వేస్తే ఈ మ్యాచ్‌లో 4 వికెట్లతో పంజాబ్ జట్టు విజయం సాధించింది. దీంతో జిల్లాలోని చాలామంది పెద్ద మొత్తంలో నష్టపోయినట్లు బెట్టింగ్ రాయుళ్లు బాహటంగానే చెబుతున్నారు. ఏ టీ కేఫ్‌లో కూర్చొన్నా... మరే ప్రాంతంలో ఉన్నా... అందరి చర్చ బెట్టింగ్‌పైనే ఉంటోంది.

ఆన్‌లైన్.. ఆఫ్‌లైన్ బెట్టింగ్‌ల జోరు..

క్రికెట్ బెట్టింగ్‌ల కోసం ప్రత్యేకంగా కొన్ని యాప్‌లను నిర్వాహకులు సృష్టించారు. ఇవి చాలా వరకూ హిడెన్ మోడ్‌లోనే ఉంటాయి. స్మార్ట్ ఫోన్లను పోలీసులు తనిఖీ చేసినా వీటిని కనుక్కోవడం అంత ఈజీ కాదు. వీటి ద్వారా రూ.10 వేల నుంచి రూ.10 లక్షలు వరకూ డిపాజిట్ చేసుకుని బెట్టింగ్‌లు కట్టే వెసులుబాటు ఉంటుందని కదిరికి చెందిన ఓ బెట్టింగ్ వ్యసనపరుడు తెలిపారు. గెలుపు, ఓటములతో పాటు బంతి బంతికీ బెట్టింగ్‌లు జరుగుతాయని అంటున్నారు. 'ఈ ఓవర్‌లో ఎంత స్కోర్ చేస్తారు? ఈ ఓవర్‌లో వికెట్ పడుతుందా? ఫలానా బ్యాటర్ సెంచరీ చేస్తాడా? ఏ బౌలర్ ఎక్కువ వికెట్లు తీస్తాడు? ఈ మ్యాచ్‌లో మొత్తం స్కోర్ 200 దాటుతుందా? ఈ ఆటగాడు ఎన్ని సిక్స్‌లు కొడతాడు?.... ఇలా ఆట ముగిసే వరకూ పలు రకాలుగా బెట్టింగ్‌లు కొనసాగుతాయన్నారు. వీటిపై ఆన్‌లైన్‌లో ఫేవర్, అన్‌ఫేవర్ అని రెండు ఆప్షన్లు ఉంటాయని, ఫేవర్ అంటే పందెం వేసిన వ్యక్తి చెప్పినట్లు జరిగితే ఆన్‌లైన్ ద్వారా మూడు రెట్లు చెల్లింపులు ఉంటాయని తెలిపాడు. ఆఫ్‌లైన్ ద్వారా జరిగే బెట్టింగ్‌లను కొందరు ఏజెంట్ల ద్వారా నేరుగా నడుస్తున్నాయని, ఇందులో కూడా ముందే వారి చేతికి కొంత డబ్బు చెల్లించాల్సి ఉంటుందని వివరించారు.


అన్ని ప్రధాన పట్టణాల్లో ఏజెంట్లు..

జిల్లాలోని కదిరి, ధర్మవరం, హిందూపురం, మడకశిర, పెనుకొండ, పుట్టపర్తి ఇలా అన్ని ప్రధాన పట్టణాల్లో ఐపీఎల్ క్రికెట్‌పై బెట్టింగ్‌ల కోసం స్థానికంగా కొందరు నమ్మకస్తులను ఏజెంట్లుగా బుకీలు నియమించుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. వీరు రూ.50 వేల నుంచి రూ.10 లక్షల వరకు నగదు ముందస్తుగానే డిపాజిట్ చేయించుకుని బెట్టింగ్‌లు నిర్వహిస్తున్నారు. డిపాజిట్ మొత్తం అయిపోతే మళ్లీ డిపాజిట్ చేయించుకుంటారు. ఏజెంట్లు ఏ రోజుకారోజు తమ సెల్ నంబర్ మార్చేస్తూ బెట్టింగ్ రాయుళ్లకు మాత్రమే కొత్త నెంబర్‌ను తెలియజేస్తుంటారు. ఆట మొదలైనప్పటి నుంచి ముగిసే వరకూ పందెం వేసే వారి సెల్‌ఫోన్‌లను ఏజెంట్ల దగ్గరే పెట్టుకుని తర్వాత తిరిగి ఇచ్చేస్తారు.

బెట్టింగ్‌లకు కోడ్..

బెట్టింగ్ ఏజెంట్లు లాడ్జిలు, ఫాంహౌస్‌లు, అద్దె ఇళ్లు, కొన్ని చోట్ల దాబా హోటళ్లలో ఉంటూ ఏ రోజుకారోజు తమ స్థావరాలను మారుస్తున్నట్లు తెలుస్తోంది. దాబా హోటళ్లలో ఉన్నప్పుడు అక్కడున్న వారికి అర్థం కాకుండా కోడ్ భాష ఉపయోగిస్తుంటారు. కొన్ని యూట్యూబ్ ఛానల్స్ బెట్టింగ్ రాయుళ్లకు బాగా ఉపయోగ పడుతున్నాయని, ఫలానా జట్టుకు గెలుపు అవకాశాలు మెండుగా ఉన్నాయని ముందే చెప్పడంతో వాటిపై పెద్ద మొత్తంలో బెట్టింగ్‌లు వేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రికెట్ బెట్టింగ్‌లపై జిల్లా వ్యాప్తంగా పోలీస్ యంత్రాంగం అప్రమత్తం కావాల్సి ఉంది.

నిఘా పెంచాం



క్రికెట్‌ను ఎంజాయ్ చేయండి..కానీ ఎవ్వరూ బెట్టింగ్‌లు వేయవద్దు. క్రికెట్ బెట్టింగ్ రాయుళ్లను పట్టుకునేందుకు నిఘా పెంచాం. గతంలో బెట్టింగ్‌లకు పాల్పడిన వారి కదలికలు ఎప్పటికప్పుడు పసిగడుతున్నాం. లాడ్జీలు, హోటళ్లు, తదితర ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు చేపడుతున్నాం. బెట్టింగ్ జరగకుండా చూడాలని డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలకు ఆదేశాలిచ్చాం. – ఎస్.వి.మాధవరెడ్డి, ఎస్పీ

లారీ ఢీకొని ఆటో డ్రైవర్ మృతి

ధర్మవరం అర్బన్: ఆగి ఉన్న ఆటోను లారీ ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... చెన్నేకొత్తపల్లి మండలం బసినేపల్లి గ్రామానికి చెందిన ధనుంజయరెడ్డి(40) కూరగాయల వ్యాపారం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ క్రమంలో కూరగాయల కొనుగోలు కోసం మంగళవారం తెల్లవారుజామున తన ఆటోలో ధర్మవరానికి వచ్చిన ఆయన... డీజిల్ వేయించుకునేందుకు మార్కెట్ యార్డు వద్ద ఉన్న పెట్రోల్ బంక్ వద్ద రోడ్డు పక్కన వాహనాన్ని ఆపాడు. అదే సమయంలో తాడిపత్రి నుంచి వేగంగా వచ్చిన లారీ ఆటోను ఢీకొంది. ఘటనలో ధనుంజయ అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ అక్కడి నుంచి పారిపోయాడు. విషయం తెలుసుకున్న టూటౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలు ఆరా తీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతునికి భార్య సునీత, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ధనుంజయరెడ్డి (ఫైల్) సాయినాథ్(ఫైల్)

బెంగళూరులో ప్రమాదం... ధర్మవరం వాసి మృతి

బెంగళూరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ధర్మవరం మండలానికి చెందిన ఓ వ్యక్తి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, బంధువులు తెలిపిన మేరకు.. ధర్మవరం మండలం ఉప్పునేసినపల్లికి చెందిన రైతు సాయినాథ్(47) ఐదేళ్ల క్రితం బెంగళూరుకు వలస వెళ్లి అక్కడ చిక్కనహళ్లిలో ఐదెకరాల భూమిని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం తన చిన్న కుమార్తెను స్కూల్ నుంచి ద్విచక్రవాహనంలో ఎక్కించుకుని వెళుతూ ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవాహనాన్ని తప్పించబోయి రోడ్డు పక్కనున్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్నాడు. ఘటనలో తీవ్రంగా గాయపడిన సాయినాథ్‌ను స్థానికులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. మృతునికి భార్య వెంకటలక్ష్మి, కుమార్తెలు బిందు, బేబి ఉన్నారు. బిందు ఇంటర్ ద్వితీయ సంవత్సరం, బేబి 8వ తరగతి బెంగళూరులోనే చదువుతున్నారు.

అక్రమార్కుడిని కాపాడిన కందికుంట!



కడ్డీలు తరలిస్తూ పట్టుబడిన వాహనం ఇదే



సోమవారం అర్ధరాత్రి హెచ్ఎం శ్రీనివాసులును నిలదీస్తున్న గ్రామస్తులు

కదిరి అర్బన్: మనబడి నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా మిగిలిన ఇనుప కడ్డీలను గుజరీకి విక్రయించుకునేందుకు హెచ్ఎం చేసిన ప్రయత్నాలు బెడిసి కొట్టాయి. ఇది కాస్త వివాదం కావడంతో ఈ పంచాయితీ కాస్త టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కందికుంట వెంకటప్రసాద్ వద్దకు చేరింది. ఆయన అక్రమార్కుడిని కాపాడారు. వివరాలు... మండలంలోని సున్నపుగుట్ట తండా ప్రాథమిక పాఠశాలలో మనబడి నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా మిగిలిపోయిన ఇనుప కడ్డీలను ఆ పాఠశాల హెచ్ఎం శ్రీనివాసులు విక్రయించుకునేందుకు ప్రయత్నించిన విషయం తెలిసిందే. సోమవారం రాత్రి కడ్డీలన్నీ ఓ ప్రైవేట్ వాహనంలో ఎక్కించి గుజరీకి తరలించి కాటా వేయిస్తుండగా గ్రామస్తులతో కలసి పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ కుమార్‌నాయక్ అక్కడకు చేరుకుని అడ్డుకున్నారు. ఈ క్రమంలో హెచ్ఎం శ్రీనివాసులు సూచన మేరకు డ్రైవర్ వాహనాన్ని వెంటనే పాఠశాల వద్దకు చేర్చాడు. అదే సమయంలో గ్రామస్తులు అక్కడకు చేరుకుని పాఠశాల గేట్‌కు తాళం వేశారు. కాసేపటి తర్వాత విద్యాశాఖాధికారులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. నివేదిక సిద్ధం చేసి జిల్లా ఉన్నతాధికారులకు అందజేస్తామని ఈ సందర్భంగా గ్రామస్తులకు ఎంఈఓ చెన్నకృష్ణ తెలిపారు. అయితే ఎలాగైనా తనను ఈ విపత్కర పరిస్థితి నుంచి కాపాడాలంటూ టీడీపీ సానుభూతిపరుడైన హెచ్ఎం శ్రీనివాసులు... అదే గ్రామానికి చెందిన ఆ పార్టీ ముఖ్య నేతతో మొర పెట్టుకున్నాడు. దీంతో ఆయన రంగంలో దిగి కందికుంట వెంకటప్రసాద్‌ను సంప్రదించాడు. ఇదే అంశంపై మంగళవారం ఉదయం సున్నపుగుట్ట తండాకు చెందిన పలువురిని తన నివాసానికి కందికుంట వెంకటప్రసాద్ పిలిపించుకుని మాట్లాడారు. కడ్డీలను పాఠశాల ఆవరణలోనే వదిలేసి, వాహనం వెళ్లిపోయేలా దుప్పటి పంచాయితీ చేశారు. దీనిపై గ్రామంలోని పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అక్రమాలకు తెరలేపిన హెచ్ఎంపై చర్యలు తీసుకోవాలని కోరారు.

హోరాహోరీగా బండ లాగుడు పోటీలు



రాతిదూలం లాగుతున్న వృషభాలు

యాడికి: మండల కేంద్రంలో వెలసిన లక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. ఈ పోటీలకు 4 జతల వృషభాలను రైతులు తీసుకువచ్చారు. పోటీలను వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు ప్రారంభించారు. నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం పీఆర్ పల్లికి చెందిన శ్రీరాములు వృషభాలు 931.07 అడుగుల దూరం లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. తాడిపత్రికి చెందిన రమేష్‌బాబు వృషభాలు ద్వితీయ స్థానం, నంద్యాల జిల్లా పీఆర్ పల్లికి చెందిన చెందిన నాగయ్య వృషభాలు తృతీయ స్థానం, ఊబిచెర్ల గ్రామానికి చెందిన పుల్ల గోవిందు వృషభాలు నాల్గో స్థానం దక్కించుకున్నాయి. విజేత వృషభాల యజమానులకు నగదు పురస్కారాలతో నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో గోదావరి కన్‌స్ట్రక్షన్స్‌కు చెందిన నాగరాజు, ఉమ్మడి పాల ప్రభాకర్ రెడ్డి, యర్రగుడి పెద్దయ్య, వంకం పెద్ద కంబగిరిస్వామి, ఎంపీటీసీ సభ్యుడు వెంకట్రాముడు, ఉపసర్పంచ్ కాసా చంద్రమోహన్, ఆలయ ధర్మకర్త బొంబాయి రామిరెడ్డి, జేసీ చిన్న నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏపీజీఈఏ జిల్లా కార్యవర్గం ఎన్నిక రేపు

పుట్టపర్తి అర్బన్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) జిల్లా కార్యవర్గం ఎన్నిక ఈ నెల 28న జరగనుంది. ఈ మేరకు సంఘం ఎన్నికల అధికారి రఘురామనాయుడు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఎదురుగా ఉన్న ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సమావేశ మందిరంలో గురువారం ఉదయం 9 గంటలకు ఎన్నికలు ఉంటాయి. ఏకగ్రీవం కాని పక్షంలో ఏప్రిల్ 3న పోలింగ్ ఉంటుంది.

ఇండిపెండెంట్‌గా పరిపూర్ణానంద?



పరిపూర్ణానంద స్వామి

పెనుకొండ: బీజేపీ తరఫున హిందూపురం పార్లమెంట్ సీటు ఆశించి భంగపడిన ఆధ్యాత్మిక వేత్త పరిపూర్ణానంద స్వామి ఇండిపెండెంట్‌గా ఎన్నికల బరిలోకి దిగనున్నట్లు తెలుస్తోంది. స్వామి కార్యాలయ వర్గాలు కూడా ఈ విషయాన్ని ధ్రువీకరిస్తున్నాయి. ఇదే విషయం మంగళవారం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఎంపీ సీటుతో పాటు హిందూపురం ఎమ్మెల్యే స్థానానికి కూడా ఆయన పోటీ చేయనున్నారని ప్రచారం సాగుతోంది.

వైభవంగా దివ్యజ్యోతి దర్శనం

రొళ్ల: మండల కేంద్రంలో వెలసిన లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం రొళ్ల కొండపై వెలసిన ఉగ్రనరసింహస్వామి ఆలయంలో దివ్యజ్యోతి దర్శనం వైభవంగా సాగింది. వేకువజాము నుంచి ఆలయంలో విశేష అభిషేకాలు, పూజలు జరిగాయి. అనంతరం పెద్ద సంఖ్యలో భక్తులు కొండపై ఉన్న ఉగ్ర నరసింహ స్వామి ఆలయానికి చేరుకుని పూజల్లో పాల్గొన్నారు. ప్రత్యేకంగా చేసిన వంటకాలను నైవేద్యంగా సమర్పించారు. ఆలయ ఎదుట పెద్ద ఎత్తున జ్యోతిని వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. శిర, హాలియూరు, తిమ్మనహళ్లి, హొసదుర్గ, బేవినహళ్లి, ఆదివాల, హొసూరు, కున్నికెర తదితర గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో కొండ జనసంద్రమైంది. కాగా, ఉత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం గరుడ వాహన సేవలు నిర్వహించనున్నారు.



కొండపై దివ్య జ్యోతికి పూజలు చేస్తున్న అర్చకుడు

రోజంతా లెక్కించినా తేలని లెక్క!



వాహనం నుంచి ఆభరణాల బ్యాగులు బయటకు తీస్తున్న అధికారులు



ఆభరణాల విలువ, బిల్లులను పరిశీలిస్తున్న అధికారులు

- పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనంలోని స్వర్ణాభరణాల లెక్కింపు
- రూ.22 కోట్ల విలువైన నగలున్నట్లు ప్రాథమికంగా నిర్ధారణ

చిలమత్తూరు: మండలంలోని 44 వ నంబరు జాతీయ రహదారిపై సోమవారం పట్టుబడిన వాహనంలోని బంగారు, వజ్రాభరణాల విలువ ఇంకా లెక్క తేలలేదు. మంగళవారం ఆభరణాల కంపెనీ ప్రతినిధులు సమక్షంలోనే స్థానిక పోలీసు స్టేషన్‌లో జీఎస్టీ అధికారులు, తహసీల్దార్ వాహనంలోంచి ఆభరణాలను బయటకి తీసి బిల్లులు, బరువు వంటివి క్షుణ్ణంగా పరిశీలించారు. తొలుత వాహనాన్ని ట్రెజరీకి తరలించాలని చూసినా... మీడియా ఫోకస్ ఉండటంతో స్థానిక స్టేషన్‌లోనే ఉంచి మంగళవారం లెక్కింపు చేపట్టారు. రోజంతా వాటిని లెక్కపెట్టినా ఆభరణాల విలువ లెక్క మాత్రం ఇంకా తేలలేదు. సుమారు రూ.22 కోట్లు విలువ చేసే అభరణాలు ఉండవచ్చని అధికారులు సూచనప్రాయంగా తెలిపారు. అయితే పూర్తి స్థాయిలో ఇంకా విలువ లెక్కకట్టాల్సి ఉండటంతో వివరాలు తెలిపేందుకు అధికారులు నిరాకరించారు. రూ . 15 కోట్లు విలువ అని లాజిస్టిక్స్ కంపెనీ ప్రతినిధుల పేర్కొన్నా... అధికారులు లెక్కింపు మేరకు ఆ మొత్తము ఎక్కువే ఉన్నట్లు తెలుస్తోంది.

3 నుంచి పింఛన్ల పంపిణీ

పుట్టపర్తి అర్బన్: ఆర్థిక సంవత్సరం ముగింపు సందర్భంగా ఏప్రిల్ నెలలో సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ ప్రక్రియ 3వ తేదీ నుంచి ఉంటుంది. ఈ మేరకు డీఆర్‌డీఏ పీడీ నరసయ్య మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 31తో ఆర్థిక సంవత్సరం ముగియనుంది. దీంతో 1వ తేదీన కాకుండా 3వ తేదీ నుంచి పింఛన్లను పంపిణీ చేయనున్నారు. ఈ విషయంగా లబ్ధిదారులు ఎలాంటి ఆందోళనకు గురి కాకుండా వారిని చైతన్య పరచాలని సంబంధిత అధికారులను పీడీ ఆదేశించారు.

రైల్వేలో డిజిటల్ చెల్లింపులు!

- ఏప్రిల్ 1 నుంచి అమలు
- ప్రయాణికులకు తప్పనున్న చిల్లర, క్యూలైన్ సమస్య



హిందూపురం అర్బన్: రైల్వేస్టేషన్లలో డిజిటల్ చెల్లింపులకు ఆమోదం లభించింది. ఏప్రిల్ 1 నుంచి అన్ని రైల్వే స్టేషన్లలో టికెట్ల కొనుగోలుకు ప్రయాణికులు ఇకపై డిజిటల్ చెల్లింపులు చేయవచ్చు. ఈ మేరకు సౌత్ వెస్టర్న్ రైల్వే జీఎం అరవింద్ శ్రీ వాస్తవ తెలిపారు. రైల్వే స్టేషన్లలోని టికెట్ కౌంటర్లలో నగదుతో పాటు ఆన్‌లైన్ చెల్లింపులను రైల్వేశాఖ ప్రవేశ పెడుతోంది. దీంతో రైలు ప్రయాణికులు ఇప్పటి వరకూ ఎదుర్కొన్న చిల్లర, క్యూలైన్ సమస్యలకు పరిష్కారం దక్కినట్టైంది. దీంతో టికెట్లను బుక్ చేసుకునేందుకు ఇప్పటికే యూటీఎస్ యాప్‌ను రైల్వే బోర్డు అందుబాటులోకి తీసుకువచ్చింది. దీనిద్వారా టికెట్లు కొనుగోలు చేసి ఆన్‌లైన్ ద్వారా నగదు బదిలీ చేయవచ్చు. ఈ విధానంపై సరైన అవగాహన లేకపోవడంతో ఏప్రిల్ 1 నుంచి యూపీఐ (క్యూఆర్ కోడ్ స్కాన్) విధానం ద్వారా చెల్లింపులకు అవకాశం కల్పిస్తోంది. దీంతో అన్ని రకాల యూపీఐల నుంచి నగదు చెల్లింపులు కొనసాగించి టికెట్లు కొనుగోలు చేయవచ్చు. అలాగే పీఓఎస్ మిషన్లను సైతం అందుబాటులో ఉంచనుంది. కర్ణాటకలోని బెంగళూరు, యలహంక, యశ్వంతపుర, గౌరిబిదనూరు, హిందూపురం, అనంతపురం, గుత్తి, ధర్మవరం, గుంతకల్లు, పుట్టపర్తి తదితర స్టేషన్లతో పాటు పలు ముఖ్య స్టేషన్లలో డిజిటల్ చెల్లింపుల విధానం అమల్లోకి రానుంది.

1,303 మంది గైర్హాజరు

కొత్తచెరువు: జిల్లా వ్యాప్తంగా 115 కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. మంగళవారం బయలాజికల్ సైన్సు పరీక్షకు 25,737 విద్యార్థులకు గాను 24,430 మంది హాజరయ్యారు. 1,303 మంది గైర్హాజరయ్యారు.


వ్యక్తి ఆత్మహత్య



మృతుడు భూపతి

ఓడీచెరువు: మద్యం తాగొద్దని మందలించినందుకు మనస్తాపం చెంది ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... ఓడీ చెరువు మండలం వీరప్పగారిపల్లికి చెందిన గంగులప్ప కుమారుడు ఇడగొట్ట భూపతి (36)కి భార్య, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. వ్యవసాయ కూలి పనులతో జీవనం సాగించేవాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసైన భూపతి సంపాదన మొత్తం తాగుడుకే ఖర్చు పెడుతుండడంతో కుటుంబంలో ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. దీంతో తాగుడు మానేయాలని తరచూ భార్య చెబుతున్నా.. వినకుండా మొండికేసేవాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి మద్యం మత్తులో ఇంటికి చేరుకున్న భూపతిని మరోమారు భార్య హెచ్చరించింది. తాగుడు మానేసి ఇంటి అవసరాలు చూసుకోవాలని హితవు పలికింది. ఆ సమయంలో అసహనానికి గురైన భూపతి ఆమెతో గొడవపడి ఇంట్లోకి వెళ్లి తలుపు గడియ పెట్టుకున్నాడు. మంగళవారం ఉదయం ఎంత సేపటికీ తలుపు తీయకపోవడంతో అనుమానం వచ్చిన కుటుంబసభ్యులు బలవంతంగా తలుపులు తీసి లోపలకు వెళ్లి చూశారు. అప్పటికే ఫ్యాన్‌కు ఉరి వేసుకుని విగత జీవిగా వేలాడుతున్న భూపతిని చూసి బోరున విలపించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

బొలెరో బోల్తా.. ఇద్దరి మృతి



మృతుడు దేరంగుల ప్రసాద్

సింహాద్రిపురం: వైఎస్సార్ జిల్లాలో చోటు చేసుకున్న ప్రమాదంలో ధర్మవారం వాసులు ఇద్దరు మృతిచెందారు. పోలీసులు తెలిపిన మేరకు... ధర్మవరానికి చెందిన వడ్డె కులస్తులు మొక్కు తీర్చుకునేందుకు నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ సమీపంలోని అహోబిలానికి శనివారం బొలెరో వాహనంలో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో వెళ్లారు. సోమవారం తిరుగు ప్రయాణమైన వీరు వైఎస్‌ఆర్ జిల్లా సింహాద్రిపురం మండలం అంకాలమ్మగూడూరుకు చేరుకుని రాత్రికి అంకాలమ్మ గుడిలో బస చేశారు. మంగళవారం తెల్లవారుజామున ధర్మవరానికి బయలుదేరారు. సింహాద్రిపురం– వెలిదండ్ల రహదారిలో ప్రమాదకర మలుపు వద్ద బొలెరో వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. వాహనంలోని దేరంగుల ప్రసాద్(25) అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి నాయనమ్మ వెంకటమ్మ, పెద్దనాన్న రమణ, గంగాధర తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చికిత్స కోసం 108 వాహనంలో పులివెందుల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కడపలోని రిమ్స్‌కు రెఫర్ చేశారు. మార్గమధ్యంలో వెంకటమ్మ(57) మృతి చెందింది. బొలెరోలో మొత్తం ఆరుగురు ఉన్నారు. మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. మృతుడు ప్రసాద్ భార్య గౌతమి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సింహాద్రిపురం ఎస్‌ఐ అనిల్‌కుమార్ తెలిపారు.